


# క్రిస్‌మస్ పండుగ

## నక్కా విజయరామరాజు

**"అబ్బాయ్ సిన్నోడా!.... రేయ్ పుల్లయ్యా.... బుల్లియ్యా లెగుండ్రా గుర కాయ పొడిచిందంటూ" ఇల్లిల్లూ తిరుగుతూ నిద్రల్లేపుతున్నాడు షావుకారి పిచ్చయ్య గారి జీతగాడు పప్పల ఎంకయ్య.**

**"పండగ పూట కూడా ఏందహె! ఇయ్యాలపనికి పోకపోతే ఏందంట?" విసుక్కున్నాడు ఆ ఎండాకాలమే పెళ్లయిన ఏసేబు. మెల్లమెల్లగా నిద్ర లేస్తున్నారంతా. కుప్పనూర్పిళ్ళకు పిచ్చియ్యగారి పొలానికి బయలుదేరారు.**

"సంవత్సరానికొక్కసారొచ్చే మన పండక్కూడా ఇంట్లో వుండకపోతే ఎట్టా మామా? ఈ రోజు నాగా పెట్టి గుడికెల్దాం. చచ్చేదాకా రోజూ చేసే పనేగా?" అన్నాడు కండువా దులిపి భుజాన వేసుకుంటూ దాసరి సుబ్బయ్య.

"కూలీనాలీ చేసుకునే మనకేం పండగరా? రెక్కాడితేగానీ డొక్కాడనోళ్ళం. సదువుకుని ఉజ్జోగాలు సేసేటోళ్లకురా పండగలు గిండగలు మనక్కాదు అయినా పొడుగులాగి అన్నపేలకొద్దాంలెండిరా" అన్నాడు మాసూల్లో గొడ్ల బంతి తోలే మోటూరెంకయ్య.

పొగమంచు దట్టంగా కమ్ముకుంది. మాటలు తప్ప మనుష్యులు కనబడటం లేదు. వారి చేతుల్లో వున్న బీడీలు, చుట్టలు మిణుగురు పురుగుల్లా మెరుస్తున్నాయి. అంతా చేలగట్ల మీద నడుస్తున్నారు. రాత్రి కురిచిన మంచుకు వారి కాళ్లు తడుస్తున్నాయి.


"చింతలేదిక ఏసుపుట్టెను వింతగ బెత్లహేము నందున"ంటూ చర్చి దగ్గర కట్టిన మైకులోంచి పాటలు ఊరంతా హోరెత్తిస్తున్నాయి.

మైకు పాటలకు పల్లంతా నిద్ర లేచిపోయి పనుల్లో పడింది. బడి పిల్లల్తో దేవుడి పాటలు పాడిస్తూ పాల్‌గారు పైడిమ్మ చెరువు కట్టమీదున్న గూడెం నుంచి వచ్చాడు. అందరి చేతుల్లో కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. పాటలు పాడుతూ ఇల్లిల్లు, సందుగొందులన్నీ తిరుగుతున్నారు. కర్రా ధర్మారావు తప్పెట వాయిస్తుంటే కర్రా ప్రసాదు హరికెన్ లాంతర్‌తో వారి ముందు నడుస్తున్నాడు. మధ్యమధ్యలో గొంతెత్తి "ఏసు ప్రభువు నేడు పుట్టెను హల్లేలూయంటూ" పాల్‌గారు చెబుతుంటే పిల్లలంతా "హ్యాపీ క్రిస్మస్, మెర్రీ క్రిస్మస్" అంటూ పెద్దపెద్దగా అరుస్తున్నారు. ఇళ్లముందు నిలబడి పిల్లల్ని ఆసక్తిగా చూస్తున్నారు జనం. చూస్తున్న వారికి కొవ్వొత్తులిస్తూ పాటలు పాడుతూ చర్చికి జేరారు పిల్లలు.

"అప్పొ ఇయ్యాలేం కూరే?" అని ఇవాంజిలం అడుగుతుంటే, "మా అయ్య పెద్ద కర్రమోసు తెచ్చాడే" అని చెబుతుంది వజ్రమ్మ. "నువ్వేం కూరొండుతున్నావే కోడి మాసమా? ఏట మాసమా?" అని ఆరా తీస్తుంది సుగుణమ్మ. చర్చి మైకు పాటల్తో ఒకరి మాటలొకరికి అర్ధం కాక పెద్ద పెద్దగా మాట్లాడుకుంటున్నారు. ఊరి బావిదగ్గర ఆడోళ్ళ మాటల్లో – కావిళ్ళతోనూ, జోళ్ళతోనూ నీళ్లు తీసుకెల్లే మగవాళ్లతో సందడి సందడిగా వుంది. అప్పటికే వాకిల్లూడ్చేసి, పేడ కల్లాపులు జల్లి ముగ్గులేసేసి, పొయ్యలు రాజేశారు. పూరిల్లలోంచి సుడి తిరుగుతూ పొగ లొస్తున్నాయి. పొగమంచును చీల్చుకుంటూ తాటితోపులోంచి సూర్యుడు బద్ధకంగా బయటికొస్తున్నాడు. పూరిల్ల మీద సొరాకుల మధ్య నుంచి వెన్నముద్దల్లాగా సొరపూలు కన్పిస్తున్నాయి. పూరిల్ల ముందు ఏపుగా పెరిగిన బంతి పూలమొక్కలు పండక్కి స్వాగతం పలుకుతున్నట్టు తలలూపుతున్నాయి. గంగిరెద్దులు, బుడబుక్కలొల్ల హరిదాసుల వెంట తిరుగుతున్నారు కొంతమంది పిల్లలు. "చాంచిపూల్... చాంచిపూల్ మూర అయిదు పైసల్" అంటూ ఇల్లిల్లు తిరుగుతూ చామంతి పూలు అమ్ముతున్నడు కనగాల మస్తాను సాయిబు. ఆయన దగ్గర అత్తరు వాసన గుప్పున కొడుతుంది.

చర్చి ముందేసిన తాటాకు పందిరికింద పేడ కల్లాపి జల్లి ముగ్గు లేస్తున్నారు బడి పిల్లలు ఎమ్మేల్య, మాణిక్యం, మరియమ్మ. చర్చి లోపల, బయటపందిరిలో అందంగా కత్తిరించిన రంగు కాగితాలు అంటిస్తున్నారు బడిపిల్లలు. దగ్గరుండి సలహాలిస్తున్నాడు రాజారావు. సున్నం కొట్టిన చర్చి ప్రార్ధనకు ముస్తాబయ్యింది. పాటలు పాడుతూ చర్చి కొచ్చిన పాల్‌గారు ప్రార్ధన చేసి – తొందరగా సిద్ధపడి క్రిస్మస్ ప్రార్ధనకు రండని చెప్పేసి వెళ్లిపోయాడు. గోలగోలగా పిల్లలంతా చర్చి ముందేసిన తాటాకు పందిర్లో ఆడుకుంటున్నారు.

పల్లె మొత్తం పండగ హడావిడిలో వుంది. కొందరిల్ల ముందు కోళ్లు కోసి బొచ్చు పీకుతుంటే, ఇంకొంతమంది కోళ్లను తాటాకుల మంటల్లో కాలుస్తున్నారు. అరెసెలు, గారెలు, పాలతాలికలు చక్రా



ల్లాంటి పిండి వంట లొండుకునే వాళ్లు కొందరైతే, మాంసం, చేపల కూరలొండే వాళ్లు ఇంకొందరు. పల్లంతా పిండి వంటల, మసాలా వాసనల్తో ఘుమ ఘుమలాడి పోతుంది. ఇహ పండక్కి ఊరొచ్చిన ఉద్యోగస్థులు, వారి పిల్లల హడావిడి అంతా ఇంత కాదు. అప్పటికే స్నానాలు చేసి కొత్త బట్టలు తొడుక్కుని పౌడర్లు రాసుకుని రకరకాల పూలజడలతో ముద్దబంతి పువ్వుల్లా తయారయ్యారు ఉద్యోగస్తుల పిల్లలు. బడి పిల్లలంతా కొత్త బట్టలేసుకుని చర్చి దగ్గరకు ఆడుకోవడానికొస్తున్నారు. వాళ్లీడు పిల్లలు కొంతమంది లంకబీడుకు గొడ్లను తోలుకెల్తున్నారు. ''ఆ మాళిగేద పేడకడి నాది, గిన్నికొమ్ముల గేదేసే పేడ నాదంటూ'' పేడ తట్టల్తో గొడ్ల వెంట పడుతున్నారు. చింపిరి జుత్తు ఆడపిల్లలు. గొడ్లమంద పోతుంటే దుమ్మురేగుతుంది. ఆ దమ్ములో కల్సిపోయినయి వారి మొఖాలు

***

గొడ్లు కాచుకునే బుడ్డోల్లంతా లంకబీడుకు చేరారు. చర్చి మైకులోని పాటలు లంకబీడు దాకా విన్పిస్తున్నాయి. గొడ్లను లంకబీడులో వదిలేసి రోజూ కోతికొమ్మచ్చి, కర్రబిళ్ల, బచ్చాలు, గోళీలాటలు ఆడుకుంటారు. కర్రబిళ్ల తీసుకొచ్చిన సోమయ్య – ''రండ్రా ఆడుకుందాం'' అంటూ మిగిలిన పిల్లల్ని పిలుస్తున్నాడు. గొడ్లన్నీ లంకబీడులో మేస్తున్నాయి. ''నేను రాన్రా'' అన్నాడు పుల్లయ్య. అతని మనస్సు పొద్దున పాటలు పాడుతూ ఊరంతా తిరిగిన బడిపిల్లల మీద, వారు వేసుకున్న కొత్తబట్టల మీదే వుంది. ఈరోజు క్రిస్మస్ ప్రార్థనలో బడిపిల్లలంతా కలిసి 'ఏసు పుట్టుక' నాటకం వేస్తున్నట్టు చెప్పాడు అతని సావాసగాడు యాకోబు. పుల్లయ్య ధ్యాసంతా వాళ్లు ఆడబోయే నాటకం మీదే వుంది. పొద్దున్న జరిగినదంతా గుర్తొచ్చింది పుల్లయ్యకు.

''నేను కూడా నాటకంలో వుంటాన్రా'' అనడిగాడు పుల్లయ్య యాకుబుతో. ''పంతులుగారు ఊరుకోర్రా. బడిపిల్లలే ఎయ్యాలంట! నువ్వుబడికి రాటల్లేదుగా''. ''ఇప్పుడెట్టారా? నువ్వు కూడా బడికి రాకూడదూ మాకులాగే బలేగా నాటకంలో వుండే వాడివి'' అనడిగాడు యాకోబు. ''నేను బడికొత్తే యానయ్యగారి గొడ్లను ఎవరు తోలుకెల్తార్రా? ఇప్పుడు బడి గిడీ అంటే మా అయ్య తోలు తీత్తాడోయ్'' అన్నాడు పుల్లయ్య. తాటిచెట్టు మొదట్లో కూర్చోని ఆలోచనలో మునిగిపోయిన పుల్లయ్య చుట్టూ మూగారు సాహసగాళ్లు పెద్దపాములు, హనుమయ్య సాములు, రాములు, బాసి, బుల్లియ్య, పున్నయ్య, నరిశింలు, ఎంకన్న. ''ఆడుకుందాం రండ్రా'' అని మళ్లీ కేకేశాడు సోమయ్య గంగారావిచెట్టు ఆకులతో బూరలా ఊదుతూ ''బిళ్లంగోడు ఆట వద్దులేరా. ఇయ్యాళ కిస్‌మిస్ పండగ్గా! మనం కూడా బడిపిల్లల్లాగా గుడిలో ఏసినట్టు ఏసుపెభువు పుట్టినట్టు నాటకం ఏద్దామా?'' అనడిగాడు పుల్లయ్య అందరి వంకా చూస్తూ.

''అల్లకయితే అవన్నీ పంతులుగోరు చెప్పి నేరిపిత్తాడు. మనకు సదువు రాదుగా? ఎట్టారా?'' అన్నాడు బాసి. ''అవున్రా మనం బడికి పోటల్లేదుగా మనకెట్టా వత్తయిరా పాటలు, నాటకాలు'' అన్నాడు రాములు.

''రోజూ పంతులుగోరూ మా ఇంటిపక్కనే యాకోబింట్లో నేర్పిచ్చేవోడురా. ఆ నాటకాన్ని రోజూ సూత్తున్నా. నాకంత వచ్చురా కావలిత్తే మీకందరికీ ఇప్పుడే నేర్పిత్తా'' అన్నాడు పుల్లయ్య.

'నీ ఇట్టంరా' అన్నారు పిల్లలు. పుల్లయ్య ముఖం సంతోషంతో వెలిగి పోయింది. నాటకానికి నటుల్ని ఎంపిక చేశాడు. అందరిలో చిన్నపిల్లోడు బాసిని మరియమ్మ తల్లిలాగా, లావుగా వుండే నర్సింలుని హేరోదురాజుగా పెట్టాడు. సన్నగా పొడుగ్గా గెడకర్రలావుండే రాముల్ని ఏసేబుగా, సాములు, పున్నయ్య దేవదూతలు. మిగిలినోళ్లు గొర్రెల కాపరులు, జ్ఞానులు. అందరికీ పోర్షన్లు చెప్పి ఎవరెట్టా మాట్లాడాలో నేర్పాడు పుల్లయ్య.

**దేవదూత (మరియమ్మతో):** ''దయా ప్రాప్తురాలా! నీకు శుభము. దేవుడు నీకు తోడైయున్నాడు. భయపడకుము. దేవుని వలన నీవు కృప పొందితిని. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు ఏసు అని పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నత కుమారుడగును.

**మరియ (దేవదూతతో):** నేను పురుషుని ఎరుగని దానను. ఇది ఎలా జరుగును!?

**దేవదూత (మరియమ్మతో):** పరిశుద్ధాత్మా నీ మీదకు వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును. కాబట్టి పుట్టబోయే బిడ్డ పరిశుద్ధుడై దేవుని కుమారుడు అనబడును.

**దేవదూత (యేసేపుతో):** దావీదు కుమారుడవైన యేసేపు నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించినది. ఆమె ఒక కుమారుని కనును. తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును కనుక ఆయనకు ఏసు అని పేరు పెట్టుదువు అనెను.

**దేవదూత – (గొర్రెల కాపరులతో):** దావీదు పట్టణ మందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు దానికిదే మీకానవాలు. ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువుల పాకల్లో వున్న తొట్టిలో వుండుట చూచెదరు.

**జ్ఞానులు:** ''తూర్పు దేశపు జ్ఞానులము చుక్క వెంట కాన్కలతో కొండలు, లోయలు, ఎడార్లు దాటి మేము వచ్చినాము.

''యూదుల రాజుగా పుట్టిన బాలుడెక్కడ వున్నాడు? తూర్పుదిక్కున నక్షత్రము చూసి ఆయనను పూజింప వచ్చితిమి''.

**హేరోదు:** ''అటులనా? ఇక్కడ పుట్టలేదు. మీరు వెళ్లి ఆ శిశువు గురించి జాగ్రత్తగా విచారించి తెలిసికొనగానే రమ్ము, నేను కూడా వచ్చి ఆయనను పూజింతును ''–

**దేవదూత:** (యేసేపుతో) ఈ శిశువుని సంహరింపవలెనని హేరోదు వెదుకుచున్నాడు. నీవు ఈ శిశువును నీ భార్యయైన మరియను తీసుకొని ఐగుప్తునకు పారిపోయి, నేను నన్ను తిరిగి రమ్మన్నంతవరకు అక్కడే వుండుము.

**యేసేపు:** అటులనే నీవు చెప్పిన ప్రకారము ఐగుప్తునకు పోయెదము.

అందరికి కొత్త కొత్తగా గమ్మత్తుగా ఆనందంగా ఉత్సాహంగా వుంది. అలా 'ఏసు జననం' అనే నాటికను లంక బీడులో గొడ్లు కాచుకునే పిల్లలు ఆడారు. నత్త గవ్వలు, కొబ్బరాకులు, మామిడాకులు, బూడిద, మోదుగ, గంగరావి పూలే వారి ఆభరణాలు, కిరీటాలు. గువ్వ పిట్టల కోకిల కూతలే సంగీతం. ఆవులు, మేకలు, గేదెలే వారి ప్రేక్షకులు.

బడి పిల్లలంతా కల్సి గుడికట్ట మీదున్న పప్పల నర్సింలు గుడిసె దగ్గర కెల్లారు. కొబ్బరినూనె రాసి నున్నగా తలలు దువ్వుకొని రంగు రంగుల కొత్తబట్టల్లో మెరిసిపోతున్నారు. ''హనుమయ్య, పెద్దపాములు అంజనీలు ఏరప్పా కనబడటం లేదే? ఇంటో లేరా! యాడికెల్లారు?'' అని అడిగాడు యేసురత్నం.

''ఇంకేడికెల్తారయ్యా గొడ్లు తోలుకుని లంకబీడికి'' చెప్పింది భాగ్యమ్మ. ''చర్చిలో కట్టడానికి బంతి

పూలు కావాలి పెద్దమ్మా'' అడిగాడు యాకోబు.

''మామా! మామా! మాకు గొబ్బరాకులు, బంతిపూలు కావాలి. ఇయ్యాల కిస్మిస్ పండగ్గా, గుడిలో కట్టాలని పంతులు గారు పంపాడు'' అన్నారు. పిల్లలు పది పదిహేను మందికి పైనే వున్నారు. కొబ్బరి చెట్టు కింది ఎండు కొబ్బరి కాయలు పీచు తీస్తున్నాడు నర్శింలు. అతని భార్య బాగ్యమ్మ పిల్లలందరికి ఎండు కొబ్బరి ముక్కలు పెట్టింది. ఇంటెనకవున్న బంతి తోటలో కెల్లింది. పసుపు ఎరుపు పూలతో అందంగా వుంది బంతిపూల తోట. బియ్యపుబంతి, కారం బంతి, ముద్దబంతి, నూకబంతి పూలు బుట్టెడు కోసుకొచ్చింది. ఈ లోపు నర్శింలు కొబ్బరి చెట్టెక్కి మట్టలు కొట్టాడు. పూలు తీసుకుని, తలొక కొబ్బరి మట్టను భుజానేసుకుని వెల్తూ – ''మరచి పోకుండా గుడిలో ప్రార్థనకు రండి పెద్దమ్మ నేను కూడా నాటకంలో వుండాను. గాబ్రేల్ దూతగా'' అన్నాడు సామెలు. నేను హేరోదు రాజును అన్నాడు యాకోబు. ''వత్తాంలేరా పలారంకి గొబ్బరి కాయలు తేవద్దు'' చెప్పింది నవ్వుతూ భాగ్యమ్మ. కొబ్బరి మట్టలు తీసుకొని వెళ్లిపోయారు పిల్లలు.

''పిల్లకాయలెంత ముద్దొత్తున్నారో సూడు'' అంది భాగ్యమ్మ వెల్తున్న పిల్లల వంక చూస్తూ ''బల్లో సదువుకుంటున్నారుగా – కొత్తబట్టలేసుకుని సుబ్బరంగా వుండారు'' అన్నాడు నర్శింలు. ''మన పిల్లల్ని కూడా బడికి పంపమని ఆ పంతులుగారు ఎన్నిసార్లు ఇంటి చుట్టూ తిరిగినా నువ్వు బడికి పంపలేదయ్యా – ఆల్లేమో జీబురుతలల్తో పిర్రల మీద చిరిగి పోయిన చెడ్డీలేసుకుని పండుగ పూట కూడా గొడ్లు తోలుకుంటూ చెట్టులు పుట్టలు పట్టి తిరుగుతున్నారయ్యా. మన పిల్లగాల్లతో పుట్టిన బుల్లియ్య, నాంచారయ్య, యాకోబు, ఏసురత్నం, ఏలియ్యలు సూడు సక్కగా బడికి పోయి సదువుకుంటున్నారు'' అంది భాగ్యమ్మ. ''ఏం చేద్దామే మనకరమ అట్టా రాసుంది! మన పిల్లగాళ్లకి సదువు గీత లేదంటూ'' ఇంకొక కొబ్బరి కాయ అందుకున్నాడు నర్శింలు. గుదికట్ట మీదున్న కొబ్బరి తోటకు, మామిడి తోటకు, తాటి తోపుకు చుట్టుపక్కల చేలకు కాపలా కాసేది ఆయనే.

***

అనంతపురం నుంచి క్రిస్మస్ సెలవలకొచ్చిన రాజారావు గ్లాస్కో పంచె, టెర్లీన్‌షర్టు వేసుకుని వెంకటరత్నం హోటల్ ముందు నిలబడ్డాడు. అతనితో పాటు కండక్టర్ రత్నం, మిలట్రీ నుంచి వచ్చిన ఎంకటేసు, కోటేసు, లాజరు బి.ఏ. చదువుతున్న చలపతి, ఏసుపాదం, టీచర్ శ్రీరాములు, వర్రె రాధాక్రిష్ణమూర్తి వున్నారు. డప్పు వాయిస్తూ ఆ రోజు వేయబోయే 'పాలేరు' నాటకం గురించి దండోరా వేస్తూ అక్కడికొచ్చాడు కర్రా ధర్మారావు. వీళ్లిందర్ని చూసి ఆగిపోయాడు. ధర్మారావుని పలకరించాడు రాజారావు. అందరూ కలిసి ఇడ్లీలు తిని కాఫీలు తాగారు. అంతా ఐదో తరగతి దాకా మిషను బడిలో కల్సి చదువుకున్నోళ్లే! మంచి సావాసగాళ్లు చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు. 'నేను కూడా వీళ్లతో పాటు చదువుకుని వుంటే వీళ్లలాగా ఖరీదైన బట్టలేసుకుని ఉజ్జోగం చేసే వాణ్ణిగా' అని లోన లోన అనుకున్నాడు ధర్మారావు. ఇపుడనుకుని ఏం లాభం? ''వత్తారా! దండోర వేయాలిసిన ఊరు చానా వుందంటూ'' లేచి డప్పు వాయించుకుంటూ మాచర్ల వారి వీధివైపు వెళ్లి పోయాడు. ఊర్లో ఏది దండోరా వెయ్యాలన్నా కర్రా ధర్మారావే!

చర్చిలో ప్రార్థన మొదలైంది. ఊరి పెద్దలు కూడా కొంతమంది వచ్చారు. కొత్త బట్టలేసుకుని జండాలు, ఫలహారాలు తీసుకుని పల్లె జనమంతా గుడికొచ్చారు. గుడి లోపల చోటు చాలకపోతే బయట వేసిన తాటాకు పందిరి కింద కొంతమంది కూర్చున్నారు. పాటలు, పిల్లల నాటకం, పాస్టరు గారి ప్రసంగం, మొక్కుబడి కానుకలు, అయినాక కొబ్బరి ముక్కలు, మరమరాలు, శెనగప్పులు కలిపిన ఫలహారం పంచారు. మొక్కుబడి కానుకలుగా తెచ్చిన కోటేసు కోడి, సుధాకర్ కొబ్బరి కాయలకు మంచి రేటే పలికింది. సుబ్బులు తెచ్చిన సొరకాయల్ని ఎవరూ పాడకపోతే పాస్టరు గారికిచ్చేశారు. ఆశీర్వాద ప్రార్థన అయ్యేసరికి పొద్దు కనగాల సరివితోటలో కుంగింది.

***

రాత్రికి వెయ్యబోయే డ్రామాకు చర్చి ముందు దానయ్య, ప్రసాదు, చెక్కబల్లల్తో స్టేజీ కట్టారు. రంగురంగుల గుడ్డలు, కాగితాలతో అందంగా అలంకరించారు. దీపాలు పెట్టే వేళకి మూడు పెట్రోమాక్సు లైటులు కోమటి రంగయ్య కొట్లోంచి తెచ్చారు. గ్రీన్ రూం లోనికి, స్టేజీ మీదకు. స్టేజి దగ్గర పట్టపగల్లా వుంది. పిల్లలంతా చేరి గోలగోలగా ఆడుకుంటున్నారు. గుడ్డి నాగేశ్వరరావు హార్మోణియం రీడ్స్ సరిచేసుకుంటుంటే, మంగలపిచ్చారి తబలానట్టులు బిగించు కుంటున్నాడు. క్లారినెట్ సరిజేసుకొంటున్నాడు పెద్దారం సొంగయ్య. మధ్యాహ్నమే బోగంపిల్ల తెనాలి నుంచి దిగింది. ఆమెను గాలి నీలాంబరం ఇంట్లో వుంచారు. పల్లెలో వున్న చదువుకున్నోళ్లు, చదువురాని వాళ్లంతా కల్సి మూడు నెలల నుంచి పాలేరు నాటకం నేర్చుకున్నారు. డ్రామా చూడ్డానికి బంధువుల్తో పాటు, చుట్టుపక్కల ఊర్లు జనం కూడా వచ్చాడు. ఊరిపెద్దలు, సర్పంచి, మున్సబు గారు, కరణం గారు కూడా వచ్చారు. పాలేరు నాటకాన్ని మూడు నెలల నుంచి ఓపిగ్గా నేర్పాడు వర్రె రాధాక్రిష్ణ. అప్పటికే పల్లెలో జరగబోయే 'పాలేరు' నాటకం సంగతి చుట్టుపక్కల ఊర్లన్నీ తిరిగి దండోరా వేసి వచ్చాడు కర్రా ధర్మారావు. జర్మన్ జూబ్లెట్ హార్మోణియం మీద ''కలవరమాయే మదిలో నా మదిలో'' అంటూ హుషారుగా వాయిస్తున్నాడు గుడ్డి నాగేశ్వరరావు. దానికి లయబద్ధంగా తబలా వాయిస్తున్నాడు మంగల పిచ్చాహరి. కొంతమంది కుర్రోళ్లు అక్కడ చేరి పాటలు వింటున్నారు.

గాలి నీలాంబరం ఇంట్లో నటీనటులకు మేకప్పు వేస్తున్నాడు త్రిపురాంతకం. కుర్రోళ్లంతా అక్కడికి జేరారు. నాటకం మొదలుపెట్టే ముందుగా స్టేజి మీద – మాణిక్యం, మరియమ్మ పాటలు పాడారు. ''చిన్న పిల్లలైనా చాలా బాగా పాడారని'' మెచ్చుకున్నాడు సర్పంచి. ఆ తర్వాత స్కూలు టీచర్ పాల్‌గారు

## అక్షరార్తి




నేను పుస్తకాన్ని
నరుని హస్త భూషణాన్ని
మానవ విజ్ఞానానికి మస్తకాన్ని
చరిత్రను తనలో దాచుకుని
నిరంతరం జ్వలించే
అక్షరాల సమూహాన్ని
నేను పుస్తకాన్ని
వాల్మీకి శోకతప్త హృదయాగ్నిలో
పునీతనై పుట్టుకొచ్చిన
అక్షర విన్యాసాన్ని
నవరసాల రూపాన్ని
నవనవోన్మేషణాన్ని
నిశ్శబ్దంగా ధ్వనించే
నిర్నిద్ర జ్ఞానాన్ని
నేను పుస్తకాన్ని
మనిషి మస్తిష్కంలోని
మలినాన్నీ, చీకటినీ తరిమేసే
వెలుగుల ఆయుధాన్ని
మానవ మనో వికాసాన్ని
నేను పుస్తకాన్ని
నేను లేక పోతే
గతం లేదు
వర్తమానం లేదు
భవిష్యత్తూ లేదు
నేను లేకపోతే
చరిత్ర లేదు
ఆనందం లేదు
ఆవేశం లేదు
అభ్యున్నతి అసలేలేదు
కానీ నేడు
మేట వేసిన దుమ్మూ ధూళితో
చిమ్మట్ల ఛిద్రాలతో
రుజాగ్రస్తనై
అరల అలమేరాలలో
ఓ అనాధలా పడి అల్లాడిపోతు
న్నాను
అంతర్జాల మాయా జాలంలో
దృశ్య ధారా వాహికలతో
శృంగార, రుధిరమయ
చలన చిత్రాల గంజాయి
దమ్ముతో
ఊగి తూగి తేలిపోతున్న
ఈ యువతకు నేనొక
అంటరాని వస్తువుగానే మిగిలి
పోతున్నాను
నేను ఎందరో మేధావుల
హృదయ భాషని
మరెందరో కళా తపస్వుల కలల
కాణాచిని
అందుకే ఓ మనిషీ!
నన్నొక్కసారి స్పృశించి చూడు
అల్లా ఉద్దీన్ అద్భుత దీపంలా
ప్రజ్వలించి
ఆప్తహస్తాన్నై పైకి లేస్తాను
నా వాకిట్లోకిరా
నిజమైన నేస్తంగా నిలచిపోతాను
నా నట్టింట్లోకిరా
మానవత్వం పరిమళించే
నీ పూల తోటకు
రక్షణ కవచంగా మిగిలిపోతాను.

– డా. వి.ఆర్.రాసాని
సెల్ 98484 43610

స్టేజీ మీద కొచ్చి చదువు విశిష్టత గురించి ఓ ఐదు నిమిషాలు ప్రసంగం చేసి దిగిపోయాడు. తోకల చలపతి స్టేజీ మీద కొచ్చాడు. అతను పల్లె మిషను బడిలో అయిదో తరగతి దాకా చదివి ఆ తరువాత గూడవల్లిలో పది దాకా చదివి ఇప్పుడు గుంటూరు ఏసి కాలేజీలో బి.ఏ. చదువుతున్నాడు. పాలేరు నాటకంలోని పాత్రల్ని పరిచయం చేస్తూ – 'ఈ నాటకాన్ని పల్లెల్లో వున్న చదువుకున్న, చదువుకోని కుర్రోళ్లంతా కల్సి నేర్చుకున్నారని, – చదువుకుంటే పాలేరు కూడా కలెక్టరు కావచ్చు అనేదే ఈ నాటకం లోని ముఖ్యమైన నీతని'' చెప్పాడు. చాపలు గోతాం పట్టాలు, పీటలు, కుర్చీలు తెచ్చుకుని స్టేజీ దగ్గరగా కూర్చుంటున్నారు జనం.

'ఈ రోజు ప్రదర్శింపబడే సాంఘిక నాటకం పేరు ''పాలేరు''. రచన – బోయి భీమన్న, డైరెక్షన్ – పర్రె రాధాక్రిష్ణమూర్తి, అంటూ అందులోని పాత్ర లను పరిచయం చేస్తూ, యాక్టర్లందర్నీ వరసగా స్టేజీమీదకు పిలిచాడు. ముందుగా వెంకన్న (పాలేరు) పిలిచాడు. ఈ పాత్రను పాలేరుగా యాన య్యాగారి దగ్గర పన్జేస్తున్న ఆశీర్వాదం నటిస్తు న్నాడు. ఇతను పద్యాలు చాలా బాగా పాడతాడని అతన్ని పరిచయం చేశాడు.

ఆ తర్వాత వెంకటేశ్వరరావు – ఏసుపాదం బి.ఎ. ఎ.సి. కాలేజీ గుంటూరు.

కుబేరరావు: ఇతను భూస్వామి. ఈ పాత్రను రాజారావు పోషిస్తున్నాడు. అనంతపురంలో హెడ్మా స్టరని చెప్పాడు.

సుందరం: స్టాలిన్ వెటర్నిటీ డిపార్టుమెంటులో పని చేస్తున్నాడు.

ఉపకారి బడిపంతులు: శ్రీరాములు సత్తెనప ల్లెలో టీచరుగా పని చేస్తున్నాడు.

వనబాల: కుమారి సుందరి, తెనాలి

రామం, సీతమ్మ, దొంగరామన్న, రౌడీరంగడు, బంట్రోతు, పోలీసు కానిస్టేబుళ్ళు అలా నాటకంలో కన్పించే రైతులు, పాత్రధారులందర్నీ పేరుపేరున స్టేజీ మీదకు పిలిచి పరిచయం చేశాడు. చివరిగా పాలేరు నాటకానికి డైరెక్షన్ చేసిన పర్రె రాధాక్రిష్ణ మూర్తిని స్టేజీ మీదకు పిలిచాడు. శాలువా కప్పి, పూలదండవేసి సన్మానించారు ఊరి పెద్దలు, సర్పంచి. పెద్దపెట్టున చప్పట్లు, ఈలలు మోగి నయి. ''లైట్స్ ఆన్'' అని చెప్పి స్టేజీ దిగిపోయాడు చలపతి. చుట్టుప్రక్కల పెద్దారం, కనగాల, ధూళి పూడి నుంచి కూడా నాటకం చూడడానికి జనం వచ్చారు. ముసలివాళ్లు, పడుచు వాళ్లు, ఆడవాళ్లు, మగవాళ్లు, చంటిపిల్లలతో సహా అన్ని రకాల జనాల్తో కిక్కిరిసింది పోయిందా ప్రదేశం.

నాటకం మొదలైంది. పిల్లల దగ్గర్నుంచి ముస ల్లోల దాకా కన్నార్పకుండా చూస్తున్నారు. పాలేరు వేషం కట్టిన సలగాల ఆశీర్వాదం పాడిన పద్యాలకు ఒన్స్‌మోర్లు ఈలలు బాగా పడ్డాయి. కొంతమంది రూపాయ కాగితాలు పిన్నీసుతో చొక్కాకి గుచ్చారు. కలెక్టరు వెంకటేశ్వరరావు వనబాల కల్సి పాడిన పాటలకు చప్పట్లు ఈలల్తో మారుమ్రోగి పోయింది. సూటు బూటులో ఏసుపాదం అచ్చం

## ఆ తపన ఉంది



'కొత్త విషయాల పట్ల నాకెప్పుడూ ఆసక్తి ఎక్కువగానే ఉంటుంది' అని సెలవిస్తోంది శ్రద్ధా దాస్. తాజాగా 'నాగవల్లి'లో వెంకటేష్ సరసన నటించే అవకాశాన్ని చేజిక్కించుకున్న ఈ ముంబై తార ఇటీవల తన గురించి ఇలా చెప్పుకొచ్చింది. ''నేను చిన్నప్పటి నుంచీ చురుగ్గా ఉండేదాన్ని. పక్కవారు ఏదైనా కొత్తగా చేస్తుంటే ఇట్టే నేర్చుకునేదాన్ని. అలాంటిది మోడలింగ్‌లోకి వచ్చాక ఆ అలవాటు ఇంకా బలపడింది. ఏకంగా పక్కవారు మాట్లాడే భాషను నేర్చుకోవాలన్న తపన కలిగింది. తెలుగులో మాట్లాడ్డం నేర్చుకున్నది కూడా ఆ తపన వలనే. ఒక్కసారి వింటే శబ్దాలను అట్టే పలకగలగడం కూడా పలు భాషలు నేర్చుకోవడానికి ఉపకరిస్తోంది'' అని గుట్టువిప్పింది శ్రద్ధ.

కలెక్టరు లాగే వున్నాడని తెగ మెచ్చుకున్నారు జనం.

అన్నిపాత్రలు బాగా అమిరాయని మొదటిసార యినా సరే చాలా బాగా ఏక్షన్ చేశారని మాచర్ల పెద్దాసులాంటి తల నెరిసిన గొప్పనటులు కూడా మెచ్చుకున్నారు. నాటకం తెరపడే సరికి మలికోడి కూసింది. మధ్యమధ్యలో తెరపడినప్పుడు గుడ్డి నాగేశ్వరరావు హార్మోనియం మీద వాయించిన పాటలు జనాల్ని బాగా ఆకట్టుకున్నాయి.

***

''రేయ్ ఎల్లయ్యా, ఓరిసిన్నోడా ... ఎంకా... పుల్లిగా... లెగండ్రా కుప్ప నూర్పిళ్లకు ఏలయిపో తుందంటూ'' అప్పుడే నాటకం చూసి ఇళ్లకొచ్చిన జనాల్ని కేకలేసి లేపుతున్నాడు పప్పుల ఎంకయ్య.

''గూసెపాగు మామా! ఇప్పుడేగా నాటకం సూ సొచ్చింది. ఓ కునుకన్నా తియ్యకుండా ఎట్టా?'' అని యాకోబంటే ''ఇప్పుడు దాకా నాటకం సూసి పగులల్లా ఎట్టా పని చేత్తాం బాబాయ్?'' అన్నాడు ఏనోకు''. ఈ పూట నాగా పెడతే ఏవంటా? ఏడాది పొడుగునా చేసే పనేగా?'' అన్నాడు నాగేసు గొను క్కుంటూ.

''పెద్ద కలకటేర్లు బయలుదేరారండీ! కూలి పన్జే సుకునే నాయాళ్లకు నిద్దర్లేందిరా లెగండెహే!'' అంటూ ఇల్లిల్లూ తిరుగుతూ, నిద్దర్లు లేపుతున్నాడు ఎంకయ్య. పొగమంచు దట్టంగా కమ్ముకుని వుంది. పాలెం సుబ్బయ్య ఇంటిముందు వరి గడ్డితో చలి మంట కాచుకుంటున్నారు కొంతమంది. గొడ్లకు మేతేస్తుంది దీనమ్మ. రాతిగాబులో కుడితి కలుపు తున్నాడు లూథరు. చేలో ఎంకయ్య ఇంటిముందున్న వేప చెట్టు మీదున్న కోడి పుంజు విడువకుండా కూస్తుంది.

***

బడిముందు ఇరవైమందికిపైగా పిల్లలు, వారి తల్లిదండ్రులు గుమి కూడారు. వారితోపాటు పల్లె పెద్ద పర్రె బసవయ్య కూడా వున్నాడు. ఆ పిల్ల లంతా గొడ్లు కాచుకుంటూ రైతుల దగ్గర జీతాల కున్న చిన్నచిన్న జీతగాళ్లు. వారి తల్లిదండ్రులు రోజు వారీ వ్యవసాయ కూలి పనులు చేసుకునే వాళ్లు. వారిలో కొంతమంది యానయ్యగారి దగ్గర, షావుకారి పిచ్చయ్య, అత్తలూరి రంగారావు, మాచెర్ల చెంచయ్యల్లాంటి మోతుబర్ల దగ్గర జీతగాళ్లు.

''అనగనగా రాగమతిశయించుచునుండు, తిన గతినగ వేము తియ్య నుండు. సాధనమున పనులు సమకూరు ధరలోన విశ్వదాభిరామ వినురవే మా''ంటూ బడిల్లోంచి పిల్లలు చదివే పద్యాలు గోలగోలగా విన్పిస్తున్నాయి. దేవకరుణమ్మ పంతు లమ్మగారు బెత్తం పట్టుకొని పద్యాలు చదివిస్తుంది.

పాల్ పంతులుగారు మిషన్‌బడి దగ్గరకొచ్చేస రికి కొద్దిగా ఆలస్యమైంది. బడి దగ్గర మూగిన జనం వంక చూస్తూ ''విషయం ఏమిటని'' పల్లె పెద్ద పర్రె బసవయ్యను అడిగాడు.

''పిల్లల్ని బడిలో జేర్పిద్దామని వచ్చారు పంతు లుగారు'' అన్నాడు బసవయ్య.

''ఇప్పుడా! సంవత్సరం మధ్యలోనా?'' ఆశ్చ ర్యంగా అడిగాడు పాల్‌గారు.

''దయచేసి మా పిల్లగాళ్లను బళ్లో జేర్చుకోండి పంతులుగోరూ, ఇంక జీతాలకు పంపం'' అన్నారు వారంతా ఏక కంఠంతో.

''రాత్తిరి పాలేరు నాటకం చూశాం పంతులుగారు'' అన్నారు. పప్పులనర్శింలు, పెనుమాక ముత్యాలు, దాసరి ఎంకయ్య, ''రాత్రి పాలేరు నాటకం బాగా నచ్చిందన్నమాట!'' ''చాలా సంతోషం! లోనికి పోండిరా'' అన్నాడు పాల్‌గారు పిల్లల వంక చూస్తూ. పిల్లలంతా కేరిం తలు కొడుతూ బడిలోనికెళ్లారు. పుల్లయ్య యాకోబు పక్కన, పెద్దపాములు ఏసురత్నం పక్కన, హనుమయ్య యానోకు పక్కకెల్లి అలా ఎవరి సావాసగాళ్లు వారి పక్కకెల్లి కూర్చున్నారు.

బడిలోని పిల్లలందరి వైపు చూస్తు ''మనబడికి కొత్తగా పదిమంది కలెక్టర్లొచ్చారు. చప్పట్లు కొట్టండ్రా'' అన్నాడు పాల్ పంతులుగారు.

బడిల్లు పైకప్పు ఎగిరిపోతుందా అనిపించేంత గట్టిగా చప్పట్లు కొట్టారు పిల్లలు.

నవ్వు ముఖాల్తో ఆనందంగా పిల్లల వంక చూస్తున్నారు వారి తల్లితండ్రులు. బడి పిల్లల ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి.

''పల్లెకిప్పుడు నిజమైన కిస్‌మిస్ పండగ'' అందరి వంకా చూస్తూ నవ్వుతూ అన్నాడు పల్లెపెద్ద పర్రె బసవయ్య.

రచయిత సెల్:94407 47768